పెద్దపల్లి : జై తెలంగాణ అంటూ నినదిస్తున్న ఎమ్మెల్సీ కవిత

క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

పెద్దపల్లిలో దివ్యాంగుడిని ఆత్మీయంగా పలకరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఎమ్మెల్సీ కవితకు అడుగడుగునా ఘన స్వాగతం

- ఆద్యంతం ఉత్సాహం.. కార్యకర్తల్లో నూతనోత్తేజం

పెద్దపల్లి, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్/పెద్దపల్లి రూరల్: టీబీజీకేఎస్ ఆత్మీయ సమ్మేళనంతో పాటు కార్మిక నేత కౌశిక్ హరి కూతురు వివాహ వేడుకకు హాజరయ్యేందుకు సోమవారం పెద్దపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని పెద్దపల్లి జిల్లాకు వచ్చిన ఆమెకు ముందుగా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సుల్తానాబాద్ మండల కేంద్రంతో పాటుగా పెద్దపల్లి మండలం పెద్దకల్వల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంగళహారతులిచ్చి, గుమ్మడి కాయతో దిష్టి తీసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భారీ వాహన కాన్వాయ్‌తో ఆమె వాహన శ్రేణిని అనుసరిస్తూ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నివాసంలో తేనేటి విందు స్వీకరించారు. అనంతరం ఆమె నేరుగా అయ్యప్ప ఆలయ చౌరస్తాలో గలని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు అంటూ నినాదాలు చేశారు. నినాదాలను కార్యర్తలు అనుసరించడంతో కొద్ది సేపటి వరకూ నినాదాలు కొనసాగాయి. ఎమ్మెల్సీ కవితను చూసి అదే చౌరస్తాలో ఉన్న ఒక వికలాంగుడు ఆమెను కలిసేందుకు ప్రయత్నించాడు. ఆయనను ఆమె ఆత్మీయంగా పలకరించారు. అదే సమయంలో ఒక మహిళ కవితను ఆత్మీయంగా పలకరించగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. అక్కడి నుంచి నేరుగా రాఘవాపూర్ శివారులోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆమెతో సెల్ఫీలు దిగేందుకు, సన్మానించేందుకు పోటీ పడ్డారు. శాలువాలు, బొకేలు అందజేస్తూ ఫొటోలు దిగారు. గజమాలలతో ఎమ్మెల్సీని సత్కరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష నివాసంలో అల్పాహారం చేసి కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం పెద్దపల్లిలో బీఆర్ఎస్‌వై నాయకుడు పడాల సతీశ్ గౌడ్‌కు చెందిన శ్రీ బాలాజీ పంప్స్ అండ్ మోటార్స్‌లో కాసేపు కూర్చొని కార్యకర్తలతో ముచ్చటించారు. కవిత ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమిల్ల రాకేశ్ కుమార్, జాగృతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సలేంద్ర కొమురయ్య యాదవ్, మాజీ ఎంపీపీ బండారి ప్రవంతీ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మర్కు లక్ష్మణ్, సలేంద్ర రాములుయాదవ్, నర్ల అంజయ్యయాదవ్, పోసాని శ్రీనివాస్ యాదవ్, పడాల సతీష్‌గౌడ్, గుండేటి మధుయాదవ్, ఉప్పు శివకుమార్ పటేల్, నర్ల పోల్‌రాజు యాదవ్, నర్ల సాయి యాదవ్, అట్ల సాగర్ యాదవ్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్, జాగృతి నాయకులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : ఎమ్మెల్సీ కవితకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ కవిత

'దిక్సూచి క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లిలో దిక్సూచి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బిజిగిరి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఇక్కడ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్, తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ పసుల చరణ్, నేషనల్ బహుజన ఫ్రంట్ కన్వీనర్ రణధీర్ సింగ్ రాణా, పడాల సతీష్ గౌడ్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలోని వార సంత (ఫైల్)

చిరు వ్యాపారులపై మళ్లీ తైబజారు పిడుగు?

- వసూళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న బల్దియా
- వారసంతలో అరకొరగానే వసతులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3: రామగుండం నగర పాలక సంస్థ నిర్ణయంతో చిరు వ్యాపారులపై మళ్లీ తైబజారు పిడుగు పడనుంది. రామగుండం, ఎన్టీపీసీ, గోదావరిఖని, యైటింక్లయిన్ కాలనీ, గౌతమినగర్ తదితర ప్రాంతాల్లో వారం వారం జరిగే సంతల్లో చిరువ్యాపారుల వద్ద నుంచి తైబజార్ ఈసారి నేరుగా బల్దియానే వసూలు చేయడానికి సన్నద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి కలెక్టర్, నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి ఆదేశానుసారం చర్యలు చేపట్టబోతున్నది. గతంలో వారం సంతల నుంచి తైబజారు వసూలుకు వేలం వేసి కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించేవారు. కాంట్రాక్టర్ నగర పాలక సంస్థ నిర్దేశించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడేవారు. దీంతో గత బీఆర్ఎస్ హయాంలో చిరు వ్యాపారులకు తైబజారు రుసుం నుంచి విముక్తి కల్పిస్తూ వసూళ్లను పూర్తిగా నిలిపివేసింది. అప్పటి నుంచి చిరు వ్యాపారులు స్వేచ్ఛగా అమ్ముకునేవారు. ఇటీవల కాలంగా నగర పాలక సంస్థ తమ ఆదాయ వనరులపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా బల్దియాకు తక్కువ ఆదాయం వచ్చే తై బజారు వసూళ్లను పునరుద్ధరించే ఆలోచనలో పడింది. దాంతో తైబజారు రుసుం వసూళ్లు చేసేందుకు వేలం నిర్వహించగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక బల్దియాలో ట్రేడ్ లైసెన్సు వసూలు చేసే ఉద్యోగులతోనే వారసంతలలో తైబజారు రుసుం వసూళ్లు చేయడానికి రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేసేందుకు అంతా సిద్ధం చేస్తుంది.

సమస్యల చింత...వారసంత..

కార్పొరేషన్ పరిధిలోని వారసంతల్లో సమస్యలు తిష్టవేశాయి. చుట్టు పక్కల నుంచి వచ్చే రైతులు, చిరు వ్యాపారులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. గతంలో రూ.4 కోట్ల నిధులతో గోదావరిఖని, 8వ కాలనీ, గౌతమినగర్, రామగుండంలోని వారసంతల్లో చేపట్టిన షెడ్లు వృథాగానే ఉంటున్నాయి. సరైన మౌలిక వసతులు లేక చిరు వ్యాపారులు రోడ్ల వెంట విక్రయిస్తున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విక్రయాలు చేపట్టాల్సి వస్తుంది. వారంతపు సంతకు వచ్చే వినియోగదారులకు సైతం ఏలాంటి వసతులు లేవు. కనీసం మూత్రశాలలు లేక మహిళా రైతులు తీవ్ర అసౌకర్యాలను భరిస్తున్నారు. తైబజారు పేరిట మళ్లీ చిరు వ్యాపారులపై భారం వేయబోతుంది.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి 3: నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నులి పురుగుల నివారణ మండుల పంపిణీ పై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 19ఏళ్ల లోపు పిల్లలందరికి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు అందించాలని ధికారులకు సూచించారు. జిల్లాలోని 706 అంగన్ వాడీ కేంద్రాలు, 695 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, 53 జూనియర్ కళాశాలలోని 2,27,251 మంది 1-19 ఏళ్లలోపు పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. 10న మాత్రలు మింగిన వారికి 17న అందించాలన్నారు. డీఎంహెచ్ న్న ప్రసన్న కుమారి , డీఆర్‌డీవో ఎం కాళిందిని, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్

మంథని, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉందని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఈనెల 1న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణలోని వ్యవసాయ రంగానికి, కార్మికులకు, అట్టడుగువర్గ దళిత జాతులకు, విద్యార్థి లోకానికి తీరని నష్టం జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందనారు. దేశంలోని 67శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుంటే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని దేశంలోని రైతాంగం మొత్తం ఢిల్లీ కేంద్రంగా ఉద్యమాలు చేసినా కూడా మోదీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని విమర్శించారు. వ్యవసాయ సబ్సిడీలను పూర్తిగా ఎత్తి వేసే దిశగా, ఆహార భద్రతకు సంబంధించి అతి తక్కువ బడ్జెట్ కేటాయించారని, ఎరువుల సబ్సిడీని కూడా బడ్జెట్లో తగ్గించారని ఆరోపించారు. సంవత్సరానికి రూ.12లక్షల వరకు ఆదాయంపై టాక్స్ ఎత్తి వేయడం వల్ల సామాన్య, పేద వర్గాలకు ఒరిగేదేమీ లేదన్నారు. ఇది కేవలం ఉన్నత వర్గాలకే ఈ బడ్జెట్ కేటాయించిందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా రాష్ట్ర కార్మిక, రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గొర్రెంకల సురేష్, కుల వివక్ష పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మంథని లింగయ్య, దళిత నాయకులు బూడిద తిరుపతి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

మంథని బడ్జెట్ ప్రతులను చూపుతున్న సీపీఎం నాయకులు

కార్మిక, ప్రజా వ్యతిరేక బిల్లుపై నిరసన

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 3: కార్మిక, ప్రజా వ్యతిరేక బిల్లుపై ఈనెల 5న దేశ వ్యాప్త నిరసన చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఉల్లి మొగిలి తెలిపారు. ఆర్జీ-2 ఓసీపీ-3లో సోమవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని పరిశ్రమలను రైతాంగంను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5న దేశ వ్యాప్తంగా నిరసనలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో పని చేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఓసీపీ-3పిట్ కార్యదర్శి సారంగం, నాయకులు లక్ష్మీరాజం, వెంకటనర్సయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో సీపీఎం నిరసన ర్యాలీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3: సంపన్నులకు దేశ సంపదను దోచిపెట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖనిలోని సీపీఎం కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీగా చేరుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరి, నాగమణి, నవీన్, భాస్కర్, అనూష, రజిత, మణెమ్మ, అరుణ, జ్యోతి, సరిత, లక్ష్మీ, లావణ్య, స్వరూప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు లభించిన ట్రోఫీతో రామగుండం సీపీ, అధికారులు

మూడోస్థానంలో రామగుండం కమిషనరేట్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 3: కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో రామగుండం పోలీస్ కమిషనరేట్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు సోమవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను కమిషనర్ ఎం శ్రీనివాస్ అభినందించారు. కాళేశ్వరం జోన్ పరిధి పోలీసు క్రీడాకారులు ప్రతిభ చూపి రామగుండం కమిషనరేట్‌కు 11 గోల్డ్, 15 సిల్వర్, 21 బ్రాంచ్ మెడల్స్ సాధించారని సీపీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో రాణించి కాళేశ్వరం జోన్, రామగుండం పోలీసు కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని సీపీ సూచించారు. ఇక్కడ ఆదనపు డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఇన్‌స్పెక్టర్లు అజయ్‌బాబు, కృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, మల్లేశం, సంపత్, సీసీ హరీశ్ ఉన్నారు.

నేటి ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా

పెద్దపల్లి, ఫిబ్రవరి3: రాష్ట్ర నూతన విద్యా పాలసీ రూపకల్పనపై విద్యా కమిషన్ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రక్తదాన శిబిరం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలో నాంది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైస్కూల్ ఆవరణలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ట్రస్ట్‌గా ఏర్పడి ఏటా వసంతపంచమిన రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహానికి పూజలు చేశారు. గురువులను సన్మానించారు. ట్రస్ట్ సభ్యులు బెల్లం కొండ శ్రీనివాస్ రెడ్డి, కొల్లూరి హరిప్రసాద్, నల్ల రాజిరెడ్డి, జక్కుల కుమార్, రానవేన సదయ్య, ధర్మేందర్, మాదాసి రాంచంద్రం, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి3: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని సమైక్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో భవన నిర్మాణ సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు నుంచి కార్మికులకు సంక్షేమ పథకాలు అందడం లేదని, ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదన్నారు. కార్మికు అవసరాల రీత్యా ఇన్స్‌రెన్స్ క్లెమ్ చేయడానికి వెళ్లితే ఒక్కటి కూడ కావడంలేదని ఆవేదన చెందారు. వేల్ఫేర్ బోర్డును ప్రవేట్ పరం చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యత్నిస్తుందని, ఈ నిరణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్ప టికైనా ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ నాయకులు రాజు, శంకర్, లక్ష్మీనారాయణ, సుధాకర్, మల్లేశం, సంతోశ్, శంకర్, ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

తాగునీటి వనరులు పరిశీలన

జూలపల్లి, ఫిబ్రవరి 3 : అబ్బాపూర్‌లో తాగునీటి వనరులను సోమవారం అధికారులు పరిశీలించారు. మంచినీటి బావులు, వాటర్ ట్యాంకులు, చేతి పంపులు పర్యవేక్షించారు. వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తాగునీటి వనరులకు అవసరమున్న చోట మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీవో అనిల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివప్రసాద్, కార్యదర్శి మహమీన్ పాల్గొన్నారు.

నియామకం

జూలపల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని కుమ్మరికుంట గ్రామానికి చెందిన ఎక్కిరాల స్వామి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగతోపాటు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'వేల గొంతుకలు-లక్ష డప్పులు' నిరసన ప్రదర్శన విజయవంతం చేయడానికి నాయకులతో కలిసి పని చేస్తానని వెల్లడించారు. దళితులను పెద్ద సంఖ్యలో తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

అర్జీలు స్వీకరిసస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి, ఫిబ్రవరి 3: ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి పాల్గొని ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజవాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలుంటాయని హెచ్చారించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 3 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ (ప్రయోగ) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ జనరల్ కోర్సుల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షలతో పాటు వొకేషనల్ అన్ని కోర్సు ల్లోని ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు 33 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉదయం నిర్వహించిన జనరల్ కోర్సు పరీక్ష లకు 367 మంది హాజరు కాగా, మధ్యాహ్నం పరీక్షలకు 203 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్మీయేట్ జిల్లా నోడల్ అధికారి కల్పన తెలిపారు. వొకేషనల్ ఫస్టియర్‌లో 716 మంది విద్యార్థులు హాజరు కాగా, సెకండియర్‌లో 640 మంది హాజరై నట్లు పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరుగ కుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు నోడల్ అధికారి తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3: హన్మంతునిపేటకు చెందిన గీ కార్మివడ్లకొండ లక్ష్మయ్యగౌడ్ అనే గీతకార్మికుడు ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచిజారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన లక్ష్మయ్యగౌడ్ రోజువారి మాదిరిగానే వృత్తినిర్వహణలో బాగంగా తాటిచెట్టు ఎకుతున్న క్రమంలో ప్రమాద వశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయాన్నిగమనించిన సహచర గీత కార్మికులు కుటుంబపసభ్యులు చికత్స నిమిత్తం పెద్పల్లి ప్రభుత్వ దవాఖానకుతరలించి చికిత్స జరిపిస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఆర్థి సాయం అందించి లక్ష్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సహచర కార్మికులు, గౌడ సంఘం నాయకులు కోరుతున్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 3: సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఆర్జీ-2 పరిధిలోని జోన్-3లో సోమవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2013 నుంచి దేశ వ్యాప్తంగా హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసినా సింగరేణిలో అమలు కాకుండా యాజమాన్యం అడ్డుకుంటుందన్నారు. కార్మికుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం ఇన్‌పెషెంట్‌గా కల్పించాలన్నారు. ప్రతి కార్మికునికి 7న సింగరేణి ప్రకారం జీతాలు ఇవ్వాలనీ, సీఎంపీఎఫ్ లెక్కల వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 22ను గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు దేశాయ్ నాయక్, పద్మ, ఏముల వెంకటేశ్, రవి, రాంబాయ్, లక్ష్మీ కొరమ్మ, రాజనర్సు, రాంగోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

డిప్యూటేషన్ విధానాన్నిరద్దు చేయాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 3: సింగరేణి రామగుండం రీజియన్‌లో కొనసాగుతున్న డిప్యూటేషన్ విధానాన్ని రద్దు చేయాలని హెచ్ఎంఎస్ నేత సీహెచ్ రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బులు దండుకోవడానికి కొనసాగుతున్న డిప్యూటేషన్‌ను రద్దు చేసి, సర్వేస్ ఖాళీలను సీనియరిటీ ప్రకారం భర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఓసీపీలో 60మంది ఓర్‌మెన్లు డిప్యూటేషన్‌పై కొనసాగడం ఏమిటని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అండర్‌గ్రౌండ్‌లో మహిళా కార్మికలకు వాష్‌రూమ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం గత నెల 26న జరిగిన హెచ్ఎంఎస్ ఆర్జీ-1 నూతన కమిటీ జాబితాను ప్రకటించారు. జీడీకె వైఎస్ ప్రెసిడెంట్‌గా ఎంఏ ఖయ్యూం, బ్రాంచ్ సెక్రటరీ జనరల్ మజ్దూర్‌గా పల్లె క్రాంతికుమార్, కోశాధికారిగా జీడీకె 1ఇంక్లైన్ సీనియర్ అసిస్టెంట్ దుర్గం శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా 2ఇంక్లైన్ ఎల్లక్షిషియన్ దొబ్బెటి సతీశ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోల్‌కట్టర్ డీ కొమురయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సహదేవ్, అమీర్ శెట్టి శ్రీనివాస్, హబీబ్ ఖాన్, జీ స్వామితో పాటు 43మంది సభ్యులతో బ్రాంచీ కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

అవగాహన పెంచుకోవాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 3: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మర్రి చెన్నాకెడ్డి మానవ వనరుల సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాధవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జట్టిమర్ రిజల్ట్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాట చేసిన సమాచార హక్కు చట్టం 2005పై రెండు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సమాచార హక్కు చట్టాన్ని రాష్ట్రంలో పటిష్టం చేసేందుకు ప్రతి పౌరుడు సమాచార హక్కు ద్వారా సమాచారాన్ని తెలుసుకోవాల న్నారు. సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం తరుపున ఆళవందార్ వేణుమాధవ్, రాళ్ళబండి రాజన్న, పెద్దపల్లి కోటిలింగం, మెరుగు రాజయ్య ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3 : కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సుల్తానాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉన్నదని విమర్శించారు. రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర విషయం, కార్మికులకు కనీస వేతనం నిర్ణయించే ప్రస్తావన లేదన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు పట్టుకుని మున్సిపల్ పరిధిలోని కేనాల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ తాండ్ర అంజయ్య, మాతంగి రాజమల్లు, అబ్బాస్, కోమురయ్య, రాజేశం, అన్నపూర్ణ, శోభ, రమ, విజయ, సుధా, గంగ, సునీత, పోచమ్మతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా కర్రె సంజీవరెడ్డి

పెద్